## క్లుప్తంగా

### కేసు నమోదు



**ములుగు/ములుగు రూరల్:** ములుగు మండలం రాయినిగూడెం కొత్తూరు గ్రామ శివారులో అటవీ జంతువులను వేటాడి వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తులపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. రాయినిగూడెం కొత్తూరు గ్రామానికి చెందిన దయ్యాల శ్రీకాంత్, గోగుల సురేష్, పల్లెర్ల శ్రీకాంత్‌లు అటవీ కోడిని వేటాడిన విషయంపై వారిపై డబ్ల్యూఎల్ పీఏ 1972 ప్రకారం కేసు నమోదు చేసినట్లు అటవీ శాఖ రేంజ్ శుక్రవారం అధికారి తెలిపారు. అటవీ జంతువులను వేటాడడం చట్టరీత్యా నేరమని ఎవరైనా వేటకు ప్రయత్నిస్తే శాఖ పరంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వాజేడు:** మండల కేంద్రంలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ అర్షద్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

### వాల్‌రైటింగ్ ప్రచారం



**మంగపేట:** నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పలు పార్టీల నుంచి పోటీచేస్తున్న అభ్యర్థుల పేర్లతో వాల్ రైటింగ్ ప్రచారం మండలంలో అప్పుడే ప్రారంభమైంది. ఇప్పటికే కాంగ్రెస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే సీతక్క, బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి పోటీ చేయనున్న విషయం తెలిసిందే. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయనున్న ప్రజా సేవకులు భూక్య దేవ్‌సింగ్ పేరుతో ప్రధాన రోడ్డుపై గల కల్వర్టులు, మినీ బ్రిడ్జీల గోడలను ఆయా పార్టీల నాయకుల పేర్లతో వాల్ రైటింగ్‌తో నింపేస్తున్నారు. మండలంలో ఎక్కడ చూసిన వాల్ రైటింగ్‌లే కనిపిస్తున్నాయి.

### 7వరకు నిరసన కార్యక్రమాలు



**భూపాలపల్లి రూరల్:** కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 1నుంచి 7వ తేదీ వరకు పార్టీ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు తెలిపారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరసన కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెలిశెట్టి రాజయ్య, శేఖర్, రవికుమార్, కోమల, స్వర్ణలత, మహేందర్, రమేష్, రవి, మల్లేష్, చౌదర్ రాజయ్య, గాట్ల రజిత, శారద, రోజ పాల్గొన్నారు.

### సన్మానం

**భూపాలపల్లి రూరల్:** కేటీకే ఓసి–3 ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేసి బదిలీపై కేటీకే–1గ్రూప్ ఏజెంట్‌గా బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్‌ను కేటీకే 5 ఇన్‌క్లైన్ దుర్గామాత ఆలయంలో టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరి సాంబయ్య ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శులు ఆర్ కనకయ్య, సమ్మయ్య, సాయిలు, సీహెచ్ కొమురయ్య, రాయమల్లు, అధికార ప్రతినిధి దేవరకొండ మధు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ ప్రభుత్వ బాధ్యత



మంగపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఏటూరునాగారం: జెడ్పీహెచ్ఎస్‌లో..



ఐటీడీఏ ఆవరణలో..



వాజేడులో..



వెంకటాపురం(ఎం): తహసీల్దార్ ఖాజామోహినొద్దీన్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**ఏటూరునాగారం:** పెన్షన్ ఉద్యోగుల హక్కు అని, పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని స్టేట్ టీచర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు మంచర్ల టీవీ వీరభద్రం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులంతా కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్టేట్ టీచర్స్ యూనియన్ ఏటూరునాగారం మండల శాఖ ఆధ్వర్యంలో జాక్టో పిలుపు మేరకు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులు సీపీఎస్ పెన్షన్‌కు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రాంబాబు, జిల్లా నాయకులు ఊట్నూరి రాంబాబు, లక్ష్మణ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**సెప్టెంబర్ ఒకటి విద్రోహ దినం**

సెప్టెంబర్ ఒకటిని విద్రోహ దినంగా పాటిస్తున్నామని యూటీఎఫ్ నాయకుడు కొండ చెంచయ్య, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మైపతి సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరణ చేయాలన్నారు. ఉద్యోగుల ఐఆర్, డీఏ వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూటీయూ నాయకులు కొక్కెర రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వాజేడు:** సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ.. వాజేడు ఎంఈఓ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలలో, నాగారంలోని ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. స్వరూప్ సింగ్, బాలజీ, ప్రసాద్, కవిత, బాబూరావు, నాగేశ్వరావు, భూలి, యశోద, ద్రౌపది, రజిత తదితరులున్నారు.

**వెంకటాపురం(ఎం):** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు సెప్టెంబర్ 1వ తేదీని సీపీఎస్ విద్రోహదినంగా పాటిస్తూ మధ్యాహ్న భోజన సమయంలో నల్లాబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ ఖాజామోహినొద్దిన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు కోకిల శ్రీరంగం మాట్లాడుతూ.. పెరిగిన ధరలకనుగుణంగా తక్కువ పెన్షన్‌తో సీపీఎస్ ఉద్యోగి జీవించడం కష్టమవుతుందని, ప్రభుత్వం కొత్త పెన్షన్ విధానాన్ని తొలగించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అడిచర్ల రాజయ్య, ఓదేల వేణుగోపాల్, ఆదిమూల వెంకటేష్, బండి ప్రవీణ్, వెంకట శ్రీనివాస్, రజిత, శ్రీధర్‌రెడ్డి, లావణ్య, పూర్ణిమ, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

**మంగపేట:** సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌చేస్తూ తహసీల్దార్ బైరి వీరస్వామికి పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ.. కాంట్రీబ్యూటరీ పెన్షన్ విధానం వలన ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్ట పోతున్నారని వెంటనే ఆ విధానాన్ని రద్దు చేయాలని ఓపీఎస్ విధానాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు భద్రయ్య, ప్రధాన కార్యదర్శి చింతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి చేరాల రాజేశ్వర్‌రావు, మహిళా కార్యదర్శి మేనక, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, సీనియర్ కార్యకర్తలు కొరస సారయ్య, పెట్రం సుధాకర్‌రావు, సాంబశివరావు, జమీల్, రఘు, రాజు పాల్గొన్నారు.

### చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న రమణారెడ్డి

**వెంకటాపురం(ఎం):** మండలంలోని బుర్గుపేట పరిధిలోగల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దుగ్యాల రాజుకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.40వేల చెక్కును బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి శుక్రవారం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాజు ఆస్పత్రిలో చికిత్స పొంది సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా జెడ్పీచైర్‌పర్సన్ నాగజ్యోతి చొరవతో నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కందారపు మధుకర్, గొర్రె దీలీప్, ఉమ్మడి సాంబయ్య, వెంకటస్వామి, కిరణ్,రాజు , బిక్షపతి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### పోషణ్ మాసోత్సవాలు

**మొగుళ్లపల్లి:** మండలంలోని గుడిపహాడ్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ మాసోత్సవాలలో భాగంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాధవి మాట్లాడుతూ.. గర్భిణులు ఆకుకూరలు ఎక్కువ తీసుకోవడం వల్ల రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. అలాగే ప్రతిరోజు రెండు గంటలు మధ్యాహ్నం విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు అంగన్‌వాడీలో అందించే భోజనం పాలు, గుడ్లు సెంటర్‌లోనే తినాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాశం స్వరూప, ఉప సర్పంచ్, అంగన్‌వాడి టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు



వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళ



వాయినాలు ఇస్తున్న గృహిణి



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు నాగేశ్వర్‌రావు

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలోని పలువురు మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని నోముకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాంసం మూడో శుక్రవారం సందర్భంగా మహిళలు అమ్మవారి ప్రతిమలను నెలకొల్పి చెరుకుగడలు, అరటిఆకులతో ప్రత్యేక పందిర్లు వేసి అమ్మవారిని కొలుచుకున్నారు. 11 రకాల పిండితో తయారు చేసిన నైవేద్యాలను అమ్మవారి సమర్పించారు. అనంతరం ముత్తయిదువులకు వాయినాలను ఇచ్చి పుచ్చుకున్నారు. అలాగే రామాలయంలో ఆవరణలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి శుక్రవారం పంచలోహ విగ్రహాన్ని ఆలయ ఆవరణలో నెలకొల్పి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు యల్లపగడ్డ నాగేశ్వర్‌రావు, ఆలయ చైర్మన్ మోడెం రమేష్ తెలిపారు. ఆడపడుచులు రామాలయం చేరుకొని కుంకుమ పూజ, అష్టోత్రనామార్చలను నిర్వహించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వెంకటాపురం(కె): అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశోక్



వాజేడులో..

**వెంకటాపురం(కె):** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడిమోసపోవద్దని అన్నారు. సెల్‌ఫోన్‌లో అపరిచిత వ్యక్తులు అడిగే సమాచారాన్ని ఇవ్వొద్దని సమాచారం ఇస్తే బ్యాంక్ అకౌంట్ నుంచి నగదు కాజేస్తారని అన్నారు. సైబర్ నేరగాళ్ల వలన మోసపోయినట్లు గ్రహిస్తే తక్షణమే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

**కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలి**

**వాజేడు:** గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో శుక్రవారం ఎస్సై ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఏ సమయంలో నైనా ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

## ‘అమృత్ వాటిక’ నిర్మాణానికి మట్టి సేకరణ



ములుగు రూరల్: మట్టి సేకరిస్తున్న నాయకులు



వెంకటాపురం(ఎం): నల్లగుంట గ్రామంలో..



ఎస్ఎస్ తాడ్వాయిలో..

**ములుగు రూరల్:** దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత్ వాటిక నిర్మాణానికి జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణ చేపడుతున్నామని జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో నా భూమి నా దేశం కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఆరు లక్షల యాభై వేల గ్రామాల నుంచి మట్టి సేకరణ చేపట్టి అమృత్ వాటిక నిర్మాణం చేపడుతున్నారని అన్నారు. మట్టి సేకరణను కలశాలుగా చేపట్టి మొక్కలు నాటడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నగరపు రమేష్, బలరాం, వాసుదేవరెడ్డి, స్వరూప, రాకేష్ రెడ్డి, సురేందర్, మహేందర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వెంకటాపురం(ఎం):** అజాత్ క అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృతవాటికను నిర్మించేందుకు ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి మట్టిని సేకరిస్తున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నల్లగుంట, లక్ష్మీదేవిపేట, లక్ష్మిపురం గ్రామాల్లో మట్టిని సేకరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు మండల విజయ్‌కుమార్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కారుపోతుల యాదగిరి, వైద్యుల తిరుపతిరెడ్డి, వెంకట రమణారెడ్డి, కారుపోతుల దేవేందర్, పచ్చిమట్ల తిరుపతి, మేకల రమేష్, దేవేందర్, బ్రహ్మచారి, శ్రీనివాస్, రవి, రూప్‌సింగ్, సోనాసింగ్, శ్రీధర్, ప్రదీప్, రాజేందర్, రాజు పాల్గొన్నారు.

**మట్టిని ఏకం చేసే సంస్కృతి గొప్పది**

**ఎస్ఎస్‌తాడ్వాయి:** మట్టిని ఏకం చేసే మన దేశ సంస్కృతి, సంప్రదాయం గొప్పదని బీజేపీ మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు అన్నారు. ఆజాత్ అమృత్ మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు మండల ప్రధాన కార్యదర్శి తళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని శివాలయం ప్రాంతంలో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరించి ఆ మట్టితో పవిత్ర అమృత వాటికను నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు చందా మహేష్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గొప్ప స్వామి, సీనియర్ నాయకులు కొర్నేపల్లి సేనాపతి, మండల ఉపాధ్యక్షుడు ఆలం శ్రీను, నాయకులు వల్లపు సాయి పాల్గొన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోవాలి

**మహదేవపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు నమోదుపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీరాజయ్య మాట్లాడుతూ.. ఫామ్ 6 నింపి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటురుగా నమోదు చేసుకోవాలని అన్ని గ్రామల్లో బిఎల్‌ఓలు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, అధ్యాపకులు రాజు, రమేష్, మున్నయ్య, పరుశురాములు, రజిత, రాజేందర్, మధురి, తదితరులు పాల్గొన్నారు.

**మల్హర్:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ వై శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2వ ఎస్ఎస్ఆర్‌లో భాగంగా నేడు(శనివారం), రేపు(ఆదివారం) మండలంలోని 22 పోలీంగ్ కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఓటర్ క్యాంపేన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 01/10/2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికీ ఓటర్ జాబితాలో నమోదై ఉన్న వారు ఏమైన తప్పులు ఉంటే సరి చేసుకోవాలని తెలిపారు.

## బాధిత కుటుంబాలకు అండగా కాంగ్రెస్



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

**ఎస్ఎస్‌తాడ్వాయి:** బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని బీసీ సెల్ మండల అధ్యక్షుడు, సింగిల్ విండో డైరెక్టర్ యశాడపు మల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన అల్లెం భిక్షపతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి రూ.5వేలు, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి రవి, పుల్లయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీను, సమ్మయ్య, మండల యూత్ ఉపాధ్యక్షుడు సుధాకర్, మాజీ సర్పంచ్ సారయ్య, నర్సింగరావు, నరసింహులు, సమ్మయ్య, రవి, ఓదెలు, ప్రభాకర్ రెడ్డి, సారయ్య, రాజిరెడ్డి పాల్గొన్నారు.

### ‘రాష్ట్రంలో నియంత పాలన’

**భూపాలపల్లి రూరల్:** రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన వ్యక్తం చేసి నియంత పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కల్పించాలని కోరుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఒక్కరా లేక ఇద్దరా లేక ముగ్గురా అర్థం కావడం లేదన్నారు. నియోజకవర్గంలో సైతం కుటుంబ పాలన కొనసాగుతుందని కుటుంబ పాలన నుంచి ప్రజలకు విముక్తి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే సతీమణి పక్క జిల్లాకు జెడ్పీ చైర్‌పర్సన్ కాగా భూపాలపల్లిలో అధికారం చేలాయిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రమణారెడ్డికి వచ్చినట్లు అబద్దపు ప్రచారాలు దొంగ మాటలు తనకు రావని కేవలం సిద్ధాంతపరంగా పని చేసుకుంటూ ఎమ్మెల్యేగా గెలవడం కోసం కష్టపడుతున్నారని ప్రజలు ఆదరించాలన్నారు.

# మహిళల పక్షపాతి సీఎం కేసీఆర్



ఏటూరునాగారం: కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వీఓఏలు



మంగపేటలో..

**ఏటూరునాగారం:** మహిళల పక్షపాతి సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్ అన్నారు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు(వీఏఓలకు) వేతనం పెంచినందుకు శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వీఏఓ మండల అధ్యక్షురాలు కూనూరు స్రవంతి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారన్నారు. ములుగు ఎమ్మెల్యేగా బడే నాగజ్యోతిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు హసీనా, పద్మ, జయ, రాణి, లతా, అరుణ, డీపీఎం గోవింద్ చౌహన్, ఏపీఎం పాషా, సీసీలు నాగమణి, సరోజన, విజయ, నర్సింగరావు, ఏటూరునాగారం సర్పంచ్ ఈసం.రామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కూనూరు మహేష్, ఎండి ఖాజా పాషా, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కోట నరసింహులు, తాడూరి రఘు, పీఏసీఎస్ డైరెక్టర్ మాదరి రామయ్య, ఎండీ ఆరిఫ్, గండెపల్లి నర్సయ్య, కాళ్ల రామకృష్ణ, మెర్గు వెంకటేశం, గొస్కుల రాంబాబు పాల్గొన్నారు.

**మంగపేట:** మండల కేంద్రంలోని జ్యోతి మండల సమాఖ్య(ఐకేపీ) కార్యాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏ)లు శుక్రవారం పాలాభిషేకం చేశారు. మహిళా సంఘాల ద్వారా ప్రతి నెలా అందే రూ.2000 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ 3,900 మొత్తం రూ 5,900 వేతనం పొందుతున్న వీఓఏలకు రాఖీ పండుగ కానుకగా ప్రభుత్వం రూ.8,000 పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంపట్ల హర్షం వ్యక్తం చేస్తు వీఓఏలు ముఖ్యమంతి కేసీఆర్ చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో వీఓఏ రమేష్, గణేష్‌బాబు, కల్పన, స్వప్న, రాధ, శ్రీలత, రాణి తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

**వెంకటాపురం(ఎం):** మండల కేంద్రానికి చెందిన బానోత్ భీమా నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ టీపీ జిల్లా అధికార ప్రతినిధి మెట్టు సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఖాదర్‌పాషాలు శుక్రవారం పరామర్శించారు. నాయకులు బానోతు రాజేందర్, భిక్షపతి, లెక్కల అమరేందర్ రెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, బల్ల ప్రతాప్, అబ్బాస్, అలీ తదితరులు పాల్గొన్నారు.